


*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**అలెగ్జాండ్రియా** వెళ్ళే దారిలో రెస్ట్ ఏరియా బయట గొడుగులు కింద సోఫాలు వేసి ఉన్నాయి. తారిఖ్ తను చెప్పేది కొనసాగించాడు.

"విశ్వ విజేత అలెగ్జాండర్ తను జయించిన ప్రతీ ప్రాంతంలో తన పేర ఓ పట్టణాన్ని నిర్మించాడు. అలా ప్రపంచంలో నేడు పదిహేడు అలెగ్జాండ్రియా పట్టణాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖమైంది ఈజిప్ట్‌లోని ఈ అలెగ్జాండ్రియా పట్టణం. దీన్ని క్రీస్తు పూర్వం 331లో మధ్యధరా తీరంలో అలెగ్జాండర్ నిర్మించాడు. ఇది గొప్ప రేవు పట్టణంగా అభివృద్ధి చెందింది.

"మన బస్‌లో ఎవరో చెప్తున్నారు. న్యూఢిల్లీలో ఈజిప్షియన్ కన్సులేట్‌ని టూరిజం బ్రోషర్స్ అడిగితే లేవుట. మా మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ ఏం చేస్తోంది? దటీజ్ ఈజిప్ట్. జీసస్ చిన్నప్పుడు ఈజిప్ట్‌లో జీవించాడని ఓ కథనం. ఇదే అమెరికా అయితే, 'జీసస్ చిన్నప్పుడు ఎక్కడ ఉన్నాడు. సెయింట్ మార్క్ ఏమయ్యాడు?' అని పరిశోధన చేసేవారు. ఈజిప్షియన్స్ బద్ధకస్తులు. దూరదృష్టిలేనివారు. (ఇండియన్స్ కూడా ఇంతే అని మనసులో అనుకున్నాను)

"అలెగ్జాండ్రియా ఈజిప్ట్‌లోని రెండవ పెద్ద నగరం. ఇది మెడిటరేనియన్ సముద్రతీరంలో ఉంది. ఇక్కడే ఈజిప్ట్‌లోని అతి పెద్ద ఓడరేవు ఉంది. ఈజిప్ట్ ఎగుమతి, దిగుమతులు 80 శాతం ఇక్కడినుంచే జరుగుతాయి. సూయజ్ నుంచి వచ్చే ఇక్కడి నేచురల్ గాస్, ఆయిల్ పైప్ లైన్స్ వల్ల పారిశ్రామిక కేంద్రంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. క్రీ.పూ.331లో అలెగ్జాండర్ ది గ్రేట్ ఈ నగరాన్ని స్థాపించాడు. హెలెనిస్టిక్ రోమన్, బైజాంటైన్ సంస్కృతులు వెయ్యేళ్ళపాటు ఇక్కడ విలసిల్లాయి. క్రీ.శ 641లో ముస్లిమ్స్ ఈజిప్ట్‌ని ఆక్రమించుకున్నాక, ఫుస్టాట్ (తర్వాత కైరోలో కలిసిపోయింది)ని వాళ్ళ కొత్త రాజధానిగా నిర్మించుకున్నారు.

"1970లలో మెడిటెరేనియన్‌లో చమురుని కనుగొన్నారు. మళ్ళీ నైల్ డెల్టాలో కూడా కనుగొన్నారు. మా దేశంలో బద్ధకస్తులు ఎక్కువ. మేం మాట్లాడతాం తప్ప పని చేయం. ఒకప్పుడు ఆహారాన్ని ఎగుమతి చేసేవాళ్ళం. ఈ రోజు 80% ఆహార పదార్థాలని దిగుమతి చేసుకుంటున్నాం. ఇది సిగ్గుచేటు. అలెగ్జాండ్రియాకి తక్కువమంది పర్యాటకులు వెళ్తారు. సరైన మార్కెటింగ్ లేదు. వారికి కైరోనే ప్రధాన ఆకర్షణ. వారికి అలెగ్జాండ్రియా గురించి తెలీదు." తారిఖ్ ఆవేదనగా చెప్పాడు.

ప్రతీ శుక్రవారం రాత్రి రెండు గంటలపాటు నేను నిర్వహించే టోరి రేడియో కార్యక్రమంలో ఇలా మన ఇండియా గురించి మాట్లాడినప్పుడల్లా కొందరు శ్రోతలు నన్నో దేశ ద్రోహిగా చూస్తారు. వాస్తవాన్ని బహిరంగ పరచడం దేశద్రోహం కాదని తారిఖ్ మాటల్ని బట్టి అనిపించింది. తప్పు తెలుసుకోనంత కాలం, దాన్ని మరుగు పరిచినంత కాలం మనిషి ఎదగలేడు.

బస్‌లో దూరం నుంచే ఎడమవైపు మెడిటెరేనియన్ సముద్రం, కుడి వైపు ఊరు కనిపించాయి. ఉదయం పది గంటలకి మా బస్ అలెగ్జాండ్రియాకి చేరుకుంది. కైరోలానే ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. ట్రామ్స్ కనిపించాయి. పోలీసులు బద్ధకస్తుల్లా కనిపించా రు. పెట్రోల్ ఒక లీటర్ ధర మూడు పౌన్ల నలభై సెంట్లు. అంటే ముప్ఫైరూపాయలకన్నా తక్కువ.

"ఇక్కడ అవినీతి ఎక్కువ. డ్రైవర్ పోలీసులకి డబ్బిస్తే చలానా రాయడు. ఇది ఇక్కడి మైండ్ సెట్."

అతను తమ దేశ గౌరవాన్ని పట్టించుకోకుండా ఉన్నది ఉన్నట్లు సరైన గైడ్‌లా చెప్పడం నాకు నచ్చింది.

"పసుపు, నలుపు రంగు వాహనాలు టేక్సీలు. తెలుపు, పసుపు కూడా. ఆ సైక్లిస్ట్ హెల్మెట్ ధరించలేదు. రాంగ్ రూట్‌లో ఎంత నిర్భయంగా వెళ్తున్నాడో. పోలీసులు శిక్షిస్తారని భయం ఉంటే అలా రాంగ్ రూట్‌లో వస్తాడా? పోలీసులు చూసినా పట్టించుకోరు. ఒకవేళ ఆపినా లంచం ఇస్తే వదిలేస్తారనే ధీమా. 'చలానా రాస్తే నాకో పెన్నీ కూడా రాదు. లంచం తీసుకుంటే నా జేబులోకి అది వెళ్తుంది.' ఇదీ వారి ఆలోచనాధోరణి. ఇక ట్రాఫిక్ ఎలా బాగుపడుతుంది? శిక్ష పడుతుందనే భయం ఉంటేనే ఎక్కడైనా చట్టం కాపాడబడుతుంది. ఈజిప్ట్‌లో ఇది వచ్చే సమయం ఆసన్నమైంది. మీరు ఆ మెడిటెరేనియన్ సముద్రాన్ని దాటితే యూరప్‌లో ఉంటారు. (ఈజిప్ట్ ఆఫ్రికా ఖండానికి చివర్లో, వాయువ్య మూలలో ఉంది) మే, అక్టోబర్‌ల మధ్య ఏటా 30 లక్షలమంది ఈజిప్షియన్స్ వెకేషన్‌కి రెడ్ సీకి వెళ్తారు. ఎడమవైపు ఉన్నవన్నీ యూరోపియన్ భవంతులే. ఇక్కడ మొదటగా క్రిస్టియన్ మతం కొన్ని వందల సంవత్సరాలు ఉంది. ముస్లిమ్స్ జయించాక క్రిస్టియన్ మతం దాదాపు అంతరించి వాళ్ళు అందర్నీ ముస్లిమ్స్‌గా మార్చారు. డౌన్‌టౌన్‌లోని ఇది క్రిస్టియన్ సెమెట్రీ. ఈ రెండు మతాలు వారిని ఒకే చోట పాతిపెట్టరు. ముస్లిమ్, క్రిస్టియన్ సెమెట్రీలు విడిగా ఉంటాయి మీరు గమనించారా? ఆడవాళ్ళంతా జుట్టుని కప్పుకుంటున్నారు. అమ్మాయిలు జుట్టుని కవర్ చేయకపోతే, వాళ్ళు క్రిస్టియన్స్ అని అర్థం" అలాంటి ఓ అమ్మాయిని చూపిస్తూ చెప్పాడు.

కోట పైభాగం నించీ కనపడే మెడిటెరేనియన్ సీ



"మన మొదటి స్టాప్ అలెగ్జాండ్రియా లైబ్రరీ. బండిలోనే వేచి ఉండండి. మొబైల్స్, కెమెరా, హేండ్ బేగ్స్, వాటర్ బాటిల్ లైబ్రరీకి తీసుకు వెళ్ళొచ్చో లేదో కనుక్కుని వస్తాను. ముందు చెప్పకుండా ఇక్కడ నియమాలు మార్చేస్తుంటారు. గైడ్‌గా అది నాకెంతో ఇబ్బందిగా ఉంటుంది" తారిఖ్ చెప్పాడు.

లైబ్రరీ ఎలివేషన్ డిజైన్ విలక్షణంగా ఉంది. గోడలమీద ప్రపంచ భాషల్లోని అక్షరాలు ఉన్నాయి. తారిఖ్ తిరిగి వచ్చి చెప్పాడు.

"పదిం పావుకి తెరుస్తారు. ఉదయం పన్నెండుకి ఎంట్రన్స్ టిక్కెట్స్ తీసుకున్నాను. మనకి ఇంకా టైం ఉంది కాబట్టి ముందు మనం పాంపేని చూసి తిరిగి లైబ్రరీకి వద్దాం. లైబ్రరీలోకి కెమెరా, మొబైల్ ఫోన్స్ తీసుకెళ్ళచ్చు. పెద్ద బేగ్స్‌ని తీసుకువెళ్ళకూడదు. ఈ లైబ్రరీ రూఫ్ మీకు నచ్చిందా? నాకు నచ్చలేదు. అందులో ఈజిప్షియన్ స్టయిల్ ఏదీ లేదు."

సముద్రం పక్కనే ఉన్న రోడ్డు మీద మా వాహనం వెళ్తోంది. ఎక్కువ భవంతులు బూడిద రంగులో మట్టి కొట్టుకుని ఉన్నాయి.

"రెండు మూడేళ్ళకి ఇంటికి రంగు వేయాలి అనే చట్టం ఉన్నా, మేము వేయం అందుకే కైరో కూడా అందవిహీనమైన నగరంగా మారింది. ఆ చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. నేను ఈజిప్ట్ ప్రెసిడెంట్‌నైతే ఇళ్ళకి తప్పనిసరిగా

రంగులు వేయిస్తాను. రోడ్లని శాశ్వతంగా ఆక్రమించుకున్న ఆ దుకాణాలని కూడా తొలగిస్తాను. వీళ్ళు ప్రజల జీవితాన్ని భయంకరంగా మారుస్తున్నారు. రోడ్లు రోజు రోజుకీ సన్నబడుతున్నాయి. వ్యాపారస్థులు బాగుపడుతున్నారు. మేము ట్రాఫిక్ ఇబ్బందుల్ని అనుభవిస్తున్నాం. రోడ్ మీద అక్కడక్కడ ఫుడ్ స్టాల్స్ కనిపిస్తున్నాయి కదా. అది అతి చవకైన బ్రేక్‌ఫాస్ట్. ఫనా బీన్స్ అని ఉడకబెట్టిన బీన్స్‌లో నిమ్మరసం, ఆలివ్ ఆయిల్, ఉప్పు, మిరియాలు పొడి చల్లి అమ్ముతారు. ధర ఐదు పౌండ్లు. ఈజిప్షియన్ ఫలాఫెల్ ప్రపంచం మొత్తం వ్యాపించింది. చాలామంది అనుకున్నట్లు అది టర్కిష్ వంటకం కాదు. ఈజిప్షియన్ వంటకం. ఈజిప్ట్‌లో డయాబెటిస్ సాధారణమైపోయింది. ఇక్కడ గోధుమలు, బియ్యం సమానంగా వాడతాం. మంచి బియ్యాన్ని ఎగుమతి చేసి సెకండ్ క్వాలిటీనే మాకు అమ్ముతారు. గింజ బాగా చిన్నగా ఉంటుంది.


పాంపె పిల్లర్

"ఇక్కడ 18,19 తారీకుల్లో ఎన్నికలు జరిగాయి. ప్రజలు దాన్ని బాయ్‌కాట్ చేసారు. ఎందుకంటే మేచ్‌ఫిక్సింగ్ జరిగింది. 2%ప్రజలు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇది మా ప్రెసిడెంట్‌కి సిగ్గుచేటు. అందరూ దొంగలే. నేను రేడికల్ ముస్లిమ్‌ని కాను. లిబరల్ ముస్లిమ్‌ని" తారిఖ్ చెప్పాడు.

కంకి, విమానం, కారు టైర్, ఓడ, తాళంచెవి, ముత్యపు చిప్పలోంచి కనపడే ముత్యం, గుడ్లగూబ మొదలైన ఎన్నికలు గుర్తులు, అభ్యర్థుల ఫొటోలు ఉన్న పోస్టర్స్ గోడలకి అంటించి కనిపించాయి. దారిలో చాలా కారు మెకానిక్ షెడ్లు కనిపించాయి. ఆ చిన్న రోడ్లు అచ్చం చార్మినార్ పక్కన గల రోడ్లని గుర్తుకు తెచ్చాయి.

"పాత కార్లని ఎవరూ పారేయరు. కారు బాడీలు, సగం కార్ల భాగాలతో అసెంబుల్ చేసిన కార్లని చవకగా అమ్ముతారు. కార్లకి ఊరి బయట పార్కింగ్ ప్లేస్ పెట్టి అక్కడి నించి అలెగ్జాండ్రియాలోకి బస్ సర్వీస్ పెడితే, రోడ్ మీద ఇరవై కార్ల బదులు ఓ బస్ మాత్రమే తిరుగుతుంది. లేదా వారంలో మూడు రోజులు రోడ్ల మీదకి కార్లని అనుమతించకూడదు. ఆధునిక కెమెరాలతో నిబంధనలని ఉల్లంఘించే కార్ల ఫోటోలు తీసి యజమానులని శిక్షించవచ్చు. ఇక్కడ డబుల్ పార్కింగ్ బాగా సమస్య. (ఇంకో కారుని తీయడానికి వీలు లేకుండా కారుని అడ్డంగా పార్క్ చేయడం) కారు ఫ్రంట్ సీట్‌లో కూర్చున్నవారికి బెల్ట్ కంపల్సరీ. వెనకాలది ఆప్షనల్. 'నో పార్కింగ్' సైన్ దగ్గర కారు పార్క్ చేస్తే షాప్ యజమానులు దాని అద్దాలని బద్దలు కొడతారు. కారు తుడిచే బిచ్చగాళ్ళు కూడా డబ్బివ్వకపోతే ఆ పని చేస్తారు. ఏడాది క్రితం సిరియానించి వచ్చిన వేల కొద్దీ కాందిశీకులు ఇక్కడ బిచ్చగాళ్ళుగా మారారు. కాందిశీకుల వల్ల వ్యాపారస్థుల తక్కువ సంపాదిస్తున్నారు."

ముసోలియా రోడ్‌లో షాపులు పేవ్‌మెంట్స్‌ని ఆక్రమించాయి. ఇంత రద్దీగా ఉన్నా హార్న్ మాత్రం వినపడలేదు. పేవ్‌మెంట్ మీది కూరల షాప్‌లో ఇద్దరం ఒకేసారి పెద్ద వంకాయలని చూసాం. పద్మజకి అవి ఇష్టం కాబట్టి నాకు చూపించింది. వీటిని ఎగ్‌ప్లాంట్ అని, ఆఫ్రికా గార్డెన్ ప్లాంట్ అని పిలుస్తారు.

రోడ్ మధ్య ఐలాండ్‌లో గుర్రం మీదున్న ఓ విగ్రహాన్ని తారిఖ్ బస్‌లోంచి చూపించి చెప్పాడు.

"అది 1805 - 1848 మధ్య జీవించిన ఈజిప్ట్ చక్రవర్తి ఆలీ విగ్రహం. ఆఖరి ఈజిప్ట్ చక్రవర్తి ఇన్ ఫరూఖ్ మహ్మద్ ఆలీ ఇతని మునిమనవడు. ఇన్ ఫరూఖ్ 1952లో ఇటలీకి వెళ్ళాడు. ఓ ఇటాలియన్ రెస్టరెంట్‌లో విషాహారం తిని మరణించాడు. 1953లో ఈజిప్ట్ రిపబ్లిక్ అయింది."

కైరోలోలా ఇక్కడ కూడా రోడ్ మధ్య డివైడర్‌గా చిన్న పార్క్‌లు కనిపించాయి. ప్రజలు అక్కడ కూర్చుని కూల్ డ్రింక్స్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారు.


పాంపె శిథిలాలు

పావుగంటలో పాంపె శిథిలనగరానికి చేరుకున్నాం. ఎంట్రన్స్ టిక్కెట్ 30 పౌండ్స్. అది ఓ విశాలమైన ప్రదేశం. ఒక పెద్ద స్థంబం, చుట్టూ శిథిలాలు. టూరిస్ట్‌లు పలచగా ఉన్నారు.

"మా దేశంలో రెండు రకాల మాన్యుమెంట్స్‌ని మీరు చూడచ్చు. అవి సమాధులు, ఆలయాలు. ఇతర చోట్లలా పేలస్‌లని చూడలేరు. కారణం ఆ రోజుల్లో ఇక్కడి పేలస్‌లు మట్టి, ఇటుకలతో కట్టేవారు. కొత్తకాలానికి అవి శిథిలమైపోయాయి. రాళ్ళతో కట్టి ఉంటే ఇంకా నిలిచి ఉండేవి. ఈజిప్ట్‌లో వివిధ దేవతలకి ఆలయాలని నిర్మించారు. వారే ప్రపంచాన్ని కాపాడతారని నమ్మేవారు. ఈ ఆలయాలు కాక, పెద్ద సమాధులని కూడా నిర్మించేవారు. సమాధులని 'మేన్షన్స్ ఆఫ్ ఎటర్నిటీ' అనే వాళ్ళు. ప్రాచీన ఈజిప్షియన్స్ క్రిస్టియన్స్ కాదు. ముస్లిమ్స్ కూడా కాదు. సూర్యుడ్ని కొలిచేవారు. ప్రకృతిని ప్రేమించే మమ్మల్ని పేగన్స్ అనేవారు. మా దేశంలో 365రోజులు సూర్యుడు దర్శనం ఇస్తాడు. బ్రిటన్ లాంటి చోట ఒకో రోజు సూర్యుడే కనపడడు. ఈజిప్షియన్స్‌కి దేవుళ్ళ వల్లే ఈ లోకం నడుస్తోందని తెలుసు. అందుకే వారు 400మంది దేవుళ్ళని కొలిచేవాళ్ళు. సూర్యచంద్రులు, ఆకాశం, అగ్ని, నైలు నది, మొసళ్ళని దేవతలుగా కొలిచేవారు. దేవుడు ప్రకృతి రూపం అని నమ్మేవాళ్ళు. ప్రతీ వేసవిలో నైలు నదికి వరదలు వస్తాయి. నైలు నది ఎన్నడు ఇందులో ఫెయిల్ కాలేదు. సూర్యుడు నిత్యం కనిపించడంలో ఫెయిల్ కాలేదు. ముస్లిమ్స్ దేవుడ్ని దయామయుడుగా, కరుణామయుడుగా, రక్షించేవాడుగా భావిస్తారు. అవి మనిషి దేవుడికి ఆపాదించే లక్షణాలు. ప్రతీ మతంలో ఇవే లక్షణాలని ఆపాదిస్తున్నారు. మా పూర్వీకులు కూడా ఇలాగే భావించారు. ప్రాచీన ఈజిప్షియన్స్ పునర్జన్మని నమ్మేవారు. దేవుడు ప్రపంచాన్ని చెడునించి రక్షిస్తాడనే నమ్మకంతో ఈజిప్ట్ నిండా ఆలయాలు నిర్మించారు. ఈ ఆలయాలు చర్చిలాగా వెళ్ళి ప్రార్థించేవి కావు. విశ్వాన్ని కొనసాగించే యంత్రాలుగా భావించేవారు. పూజారులు నిత్యం దేవుడ్ని అనేక క్రతువులతో పూజించేవారు. సామాన్యులకి ఆలయంలో ప్రవేశం ఉండేదికాదు. ఎందుకంటే క్రతువులు తెలీక సామాన్యులు దేవుడ్ని ఏదో ఆశించి ప్రార్థిస్తూంటారు. కానీ పూజారులు అలా కాదు. విశ్వం సరిగ్గా సాగాలని మాత్రమే ఆ క్రతువులని రూపొందించి నిర్వర్తించేవారు. వాళ్ళని ప్రజలు దేవుడితో సమానంగా ఆరాధించేవారు. వాళ్ళు నిజాయితీగా ఉన్నంత కాలం ఈజిప్ట్ ఉన్నత స్థితిలో ఉంది. వారు అవినీతికి దిగగానే ఈజిప్ట్ దిగజారింది.


కోట మీద ఎగిరే ఈజిప్ట్ జెండా

"అలెగ్జాండర్ ది గ్రేట్ ఈజిప్ట్‌కివచ్చినప్పుడు పరిస్థితి అది. దీన్ని అర్థం చేసుకుని, పూజారుల గౌరవాన్ని తను పొందితే సామాన్యులు తన వైపు మళ్ళుతారని గ్రహించాడు. ప్రాచీన ఈజిప్షియన్స్ త్రిమూర్తులైన తల్లి, తండ్రి కొడుకులని ప్రార్థించేవారు. ఆ ఆలయాలు ఇక్కడ మాత్రమే కనిపిస్తాయి. లగ్జర్, అశ్వాన్‌లో ఆలయాలు బాగా రక్షింపబడి ఉండడం మీరు గమనిస్తున్నారు. కారణం అవి మెడిటెరేనియన్‌కి దూరంగా ఉన్నాయి. ఇక్కడ భూకంపాల వల్ల కొన్ని శిధిలమయ్యాయి.

క్రీ.శ 4వ శతాబ్దంలో ఇక్కడికి వచ్చిన క్రిష్టియన్స్ చాలా ఆలయాలని నాశనం చేసారు. ఐతే నైలు నదిలో ప్రయాణించేప్పుడు చుట్టుపక్కల నాశనం కాని ఆలయాలని మీరు చూస్తారు. ఈజిప్షియన్ ఆలయానికి సాధారణంగా స్థంభాలుంటాయి. వాటి మీద వికసించిన పద్మం అలంకరణ ఉంటుంది. పెద్ద హాల్, చిన్న గర్భగుడి, ఆలయ ప్రవేశ దారిలో పాపిరస్‌పూలు గల స్థంభాల వరస ప్రధానంగా ఉంటాయి.

"దీనికి పాంపే అనే తప్పు పేరుని ఇచ్చారు. ఇది పాంపే పిల్లర్ కాదు. దీనికి, పాంపేకి ఎలాంటి సంబంధంలేదు. పాంపేని సీజర్ అలెగ్జాండ్రియాలో చంపాడు అని చదువుకున్నాం. అది నిజంకాదు. రోమన్ చక్రవర్తి డిక్లీషియన్ ఈజిప్ట్‌ని పాలించినప్పుడు క్రిష్టియానిటీ అంటే ఏమాత్రం పడేది కాదు. డిక్లీషియన్ వ్యక్తిగతంగా ఇక్కడికి వచ్చి, నగరాన్ని ముట్టడించి వాళ్ళకి అన్నపానీయాలు లేకుండా చేసాడు. తమని రక్షించమని బతిమాలి వాళ్ళు ఈ పిల్లర్‌ని అతని గౌరవార్థం 298లో నిర్మించారు అని చెప్తారు. అలెగ్జాండ్రియాలో 4వ శతాబ్దంలో ప్రజలు తిరుగుబాటు చేసినప్పుడు చక్రవర్తి డిక్లీషియన్ ఈ నగరాన్ని ఎనిమిది నెలలపాటు ముట్టడించాడు. అప్పట్లో గొప్ప క్షామం వచ్చింది. దాంతో ఏటా ఈజిప్ట్ నించి రోమ్‌కి పంపే మొక్కజొన్నని డిక్లీషియన్, అలెగ్జాండ్రియా ప్రజలకి పంచాడు. అందుకు కృతజ్ఞతగా వారు ఈ స్థంభాన్ని నిర్మించారని ఇంకో కథనం. మీరు పైకి ఎక్కితే కొన్ని స్ఫింక్స్ విగ్రహాలని చూస్తారు. వాటిని రోమన్స్ నిర్మించలేదు. ఈజిప్షియన్ ఒబ్లిస్క్‌లని చాలామంది దొంగిలించారు. మీరు రోమ్‌కి వెళ్తే పదిహేను ఒబ్లిస్క్‌లని అక్కడ చూస్తారు. 32 మీటర్ల ఎత్తుగల ఒబ్లిస్కు రోమ్‌లో ఉంది. మా దేశంలో కేవలం 30 మీటర్లది మాత్రమే అత్యంత ఎత్తైనది. మా దేశాన్ని 600 ఏళ్ళు పాలించిన రోమన్స్ చాలా దొంగిలించారు. ఒబ్లిస్కులని, ఐసిస్ దేవత విగ్రహాన్ని వారు తరలించారు. యు.కె యు.ఎస్.ఏ, టర్కీలలో కూడా కొన్ని ఒబ్లిస్కులు ఉన్నాయి. లండన్‌లో థేమ్స్ నది పక్కన , న్యూయార్క్‌లో ఈజిప్ట్‌నించి తరలించిన ఒబ్లిస్క్‌లు ఉన్నాయి.


పిల్లర్ ప్రక్కన స్ఫింక్స్

కింగ్ లూయిస్ 14, 15 రాజులు మీరు చూసే ఈ పిల్లర్‌ని పేరిస్‌కి తరలించాలని ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో విరమించుకున్నారు. దీని చుట్టూ పూర్వం 400 స్థంభాలతో పెద్ద ఆలయం ఉండేదని భావిస్తున్నారు. జూలియస్ సీజర్ నుంచి పారిపోయి ఈజిప్ట్ వచ్చిన రోమన్ జనరల్ పాంపే చితాభస్మాన్ని ఈ స్థంభం మీద ఓ కుండలో ఉంచారని నమ్మడంతో దీనికి పాంపే పిల్లర్ అనే పేరు వచ్చింది.

1803లో కమాండర్ జోన్ షార్ట్‌లేండ్ బ్రిటిష్ నౌక హెచ్.యం.ఎస్ పాసిడోర్‌లో ఇక్కడికి వచ్చి, ఫిబ్రవరి 1803న పాంపే పిల్లర్‌కి తాకేలా ఓ గాలి పటాన్ని ఎగరేసాడు. దానికి కట్టిన తాడు ఆధారంగా తాటి నిచ్చెనని వేసి అతను స్థంభం మీదకి ఎక్కి యూనియన్ ఫ్లాగ్‌ని (బ్రిటిష్ జెండా) ఎగరేసి (అప్పటికి రెండేళ్ళ క్రితమే ఈ జెండాని బ్రిటన్ రూపొందించుకుంది) కింగ్ జార్జి -3కి టోస్ట్ చెప్పి విస్కీ తాగాడు. 4 రోజుల తర్వాత అతను మళ్ళీ ఈ స్థంబం ఎక్కి, వాతావరణ సూచికని ఏర్పాటు చేసాడు. ఈ పిల్లర్ ఎర్ర రాతి శిధిలాల మీద ఉంది."

మేము వెనక అమర్చిన చెక్కమెట్లమీంచి ఆ రాతి మీదకి ఎక్కి ఆ స్థంభాన్ని, అటూ ఇటూ ఉన్న స్ఫింక్స్‌ని చూసాం. పూర్వం అక్కడ పెద్ద ఆలయం ఉన్నట్టుగా నాలుగైదు అడుగుల ఎత్తైన స్థంభాల శిథిలాలు కనిపించాయి.

"ఇది ఒకప్పటి రాకోటీస్ గ్రామం. అలాంటి పదహారు గ్రామాలని కలిపి అలెగ్జాండ్రియా నగరాన్ని నిర్మించాడు. అప్పట్లో దీన్ని 'ది ఆక్రోపోలిస్ ఆఫ్ అలెగ్జాండ్రియా (గ్రీక్ భాషలో ప్రముఖమైన, మతపరమైన ఆలయాలు నిర్మించిన చోటని అర్థం) అని పిలిచేవారు. అలెగ్జాండర్ మరణానంతరం అతని సామ్రాజ్యాన్ని చాలామంది పంచుకున్నారు. ఈ ప్రాంతం టోలమీ - ఆ ఆధీనంలోకి వచ్చింది. తమని గ్రీక్స్ పాలించాలా లేక ఈజిప్షియన్లా అన్న ప్రశ్నకి ప్రతీ ఈజిప్షియన్, ఈజిప్షియన్‌నే కోరుకుంటాడు. దాంతో అతను ఈజిప్షియన్స్, గ్రీక్స్ మధ్య సహకారం సాధించి, సామ్రాజ్యాన్ని సుస్థిరపరచడానికి ఇద్దరికీ ఒకే మతాన్ని స్థాపించాడు. ఇందుకోసం ఈజిప్షియన్ ప్రీస్ట్‌లలోని మంథన్, గ్రీక్ ప్రీస్ట్ టిమోథియస్‌లని ఎంపిక చేసాడు ప్రాచీన ఈజిప్షియన్ దేవుడి ఐసిస్, ప్రాచీన గ్రీక్ దేవుడు జియోస్ ఇద్దరూ ఒకరే అని ప్రతిపాదించి, సెరపిస్ అనే కొత్త దేవుడ్ని సృష్టించాడు. ఐసిస్, సెరపిస్, హార్పోక్రేట్స్ అనే ముగ్గురు దేవతలతో ఈ మతాన్ని ఆరంభించాడు. గ్రీక్స్‌కి సెరపిస్ తమ అధిష్ఠాన దేవత జియోస్‌తో సమానం. ఈజిప్షియన్స్ అధికంగా పూచించే ప్రాచీన దేవత ఐసి. హార్పోక్రేట్స్ నోట్లో వేలుంచుకున్న పిల్ల దేవత.

"ఇలా మత సామరస్యంతో ప్రజల మధ్య విభేదాలు లేకుండా చేసాడు. ఇక్కడున్న శిథిలాలు నాటి సెరాపిస్ ఆలయ శిథిలాలు. తవ్వకాలలో సెరాపిస్ విగ్రహం కూడా లభ్యమైంది. ఇక్కడ దొరికిన బంగారం, వెండి, ఇత్తడి, గాజు, మట్టి ఫలకాలతో రాసిన హైరో గ్లిఫిక్స్ (గ్రీక్ భాషల్లో చెక్కిన ఫలకాలు) టోలమీ -3 కాలానికి చెందినవి. క్రీ.శ. 98 -117లో నాశనమైన ఈ ఆలయాన్ని మళ్ళీ పునర్నించారు.

3వ శతాబ్దంలో ఇక్కడి ఆలయంలో దొరికిన పాపి (ఆనాటి పేపర్) రోల్స్‌లో ఆనాడు మమ్మీలుగా చేసిన జంతువుల చిత్రాలు దొరికాయి. ఈ ఆలయానికి అనుబంధంగా ఓ లైబ్రరీ కూడా ఉండేది. ఈ పాంపే పిల్లర్‌కి తూర్పున, అలెగ్జాండ్రియాకి 2.7 కిలోమీటర్ల దూరంలోని షిడియా నైద్ నించి పెద్ద కాలువని తవ్వారని కూడా తెలుస్తోంది. వరదలు వచ్చినప్పుడు ఇక్కడి నీటి లెవెల్‌ని కొలిచి వరద సుంకాలని విధించేవారు."

వర్షపు నీటిని నిలువ చేసే ఆ నాటి 12 స్టోరేజ్ టేంక్స్‌ని కూడా తారిఖ్ చూపించాడు.

తారిఖ్ ఫోటోలు తీసుకోడానికి మాకు కొంత సమయం ఇచ్చాడు.

పాంపే శిథిలాల నుంచి బయలుదేరి మధ్యాహ్నం పన్నెండుకల్లా మళ్ళీ లైబ్రరీకి చేరుకున్నాం. తారిఖ్ మాకు టిక్కెట్లు తలొకటి పంచాడు. ఒకొక్కటి 70 పౌన్లు. లైబ్రరీని చూపించే స్థానిక గైడ్ మిస్ మారా పన్నెండుపావుకి మా బృందాన్ని లోపలికి తీసుకెళ్ళింది.

"రోమన్ చక్రవర్తి హెరిడోటస్, ఈజిప్షియన్ సంస్కృతి నైల్ నది బహుమతి అని చెప్పాడు. కాని నిజానికి ఇది ప్రపంచానికి బహుమతి. అలెగ్జాండ్రియాలో 3వ శతాబ్దంలో టోలమీ చక్రవర్తి 'ది రాయల్ లైబ్రరీ ఆఫ్ అలెగ్జాండ్రియాని స్థాపించాడు. దీన్ని 'ఏన్షియెంట్ లైబ్రరీ ఆఫ్ అలెగ్జాండ్రియా' అని కూడా పిలుస్తారు. ఇది తొలి ప్రసిద్ధ గ్రంథాలయం. హోమర్, ప్లాటో, సోక్రటీస్ రాసిన గ్రంథాలు ఈ లైబ్రరీలో ఉండేవి.

ఏథెన్స్ నించి దేశ బహిష్కరణ శిక్ష విధించబడ్డ గవర్నర్ డిమిట్రియస్ మ్యూసెస్ క్రీ.పూ.295లో అలెగ్జాండ్రియా వచ్చి టోలమీ చక్రవర్తి - 2 మాట్లాడి ఈ లైబ్రరీని ఏర్పాటు చేసాడు. ఆనాడు ప్రపంచంలోని ప్రతి పుస్తకాన్ని లైబ్రరీలో ఉంచడమే అతని ధ్యేయం. ఈ మూసెస్ పేరు నించే మ్యూజియం అనే ఆంగ్లపదం పుట్టింది. 'ది టెంపుల్ ఆఫ్ ది మూసెస్' ఈ లైబ్రరీలోని ప్రథమభాగం. తొమ్మిది మంది మూసెస్ దేవతలకి ఇక్కడ ఆలయాలు ఉండేవి. లైబ్రరీలో గ్రంథాలతో పాటు లేబరేటరీలు, అబ్జర్వేటరీలు, బొటానికల్ గార్డెన్స్, జూ, లెక్చర్ హాల్స్, మీటింగ్ రూమ్స్, తోటలు, నివాసగృహాలు ఉండేవి. టోలమీ చక్రవర్తి -2 దీని విశ్వ గ్రంథాలయం చేయాలనుకుని ఇతర


లైబ్రరీ మీద రాసిన హైరోగ్లిఫిక్స్

భాషలనించి పుస్తకాలని అనువదింప చేసాడు. అరిస్టాటిల్ పర్సనల్ లైబ్రరీని ఇక్కడికి తరలించారని నమ్ముతారు. టోలమీ చక్రవర్తి -3 కి విజ్ఞానం అంటే ఎంతో ఇష్టం. అలెగ్జాండ్రియా ఓడ రేవుకి వచ్చిన ఓడల్లోని పుస్తకాలని ఈ లైబ్రరీకి ఇవ్వాలని శాసనం చేసాడు. వాటికి కాపీలు తీసుకుని మళ్ళీ తిరిగి ఇచ్చేవారు. ఆయన కాలంలో 50 లక్షల పాపిరస్ స్క్రోల్స్ ఉండేవని అంచనా. ఇది విస్తరించాక, దీనికి అనుబంధంగా మరో గ్రంధాలయాన్ని (డాటర్ లైబ్రరీ) సెరాపిస్ ఆలయంలో ఏర్పాటు చేసారు. కళలకి చెందిన 9మంది దేవతల్లో ఇది మూసెస్ అనే దేవతకి అంకితం ఇవ్వబడింది. ప్రపంచంలోని అనేకమంది మేధావులు ఇక్కడికి వచ్చి ఆ పుస్తకాలు చదివేవారు. అవన్నీ పాపరస్ స్క్రోల్స్‌లో ఉండేవి. ఎన్ని వేల లేదా లక్షల పుస్తకాలు ఉండేవో మనకి తెలీదు.

"దురదృష్టవశాత్తు ఆ లైబ్రరీ తగలబడిపోయి వాటిన్నిటినీ కోల్పోయాం. తద్వారా చాలా సాంస్కృతిక సమాచారం కూడా కోల్పోయాం. దీని నాశనానికి జూలియస్ సీజర్ మొదటి అనుమానితుడు. క్రీ.శ 48లో జూలియస్ సీజర్ దీన్ని తగలబెట్టించాడని, క్రీ.శ 391లో దీన్ని నాశనం చేయించాడని అనేక కథనాలున్నాయి. నేను అనుకోవడం ఇది ఒక్కసారి కాక అనేకసార్లు తగలబడిందని. దీని డిజైన్ మనకి నేడు తెలీదు. కానీ నేటి యూనివర్సిటీ కేంపస్ మోడల్‌లో పెద్ద డైనింగ్ హాల్, రీడింగ్ రూమ్ ఉండేవని భావిస్తున్నారు.

ఇది ఆస్ట్రానమీ, అనాటమీ, మేథమేటిక్స్, ఫిజిక్స్, జియోమెట్రిక్, జాగ్రఫీ, మెడిసన్, ఇంజనీరింగ్ మొదలైన విభాగాలకి రీసెర్చ్ సెంటర్‌గా పని చేసేది. ఆర్కిమెడిస్ యూక్లిడ్ (గ్రీక్ మేథమెటీషియన్ - ఫాదర్ ఆఫ్ జియోమెట్రిక్) ఇరథోనియస్ (గ్రీస్ ఆస్ట్రానమర్) హిరోఫెర్మస్ (మెడిసిన్ -న్ మొట్టమొదటి అనాటమిస్ట్) ఎరాసిస్ స్ట్రాటస్ (రాయల్ ఫిజీషియన్ అనాటమీ) హిపార్చస్ (గ్రీక్ ట్రిగ్ నామెట్‌రీని కనిపెట్టాడు) ఎడీషియా (ఫిలాసఫర్) పేపస్ (హెక్సాగాన్ థీరంని కనిపెట్టిన గణిత శాస్త్రవేత్త) థియాన్ (మేథమెటీషియన్) హైపేటియా (గ్రీక్ మేథమెటీషియన్) వీరంతా అలెగ్జాండ్రియాలో నివశించి ఈ లైబ్రరీలో పుస్తకాలు చదివి నేర్చుకున్నవారే. వీరు అనేక యూరోపియన్ యూనివర్సిటీలకి వెళ్ళిపని చేయడంతో కొంత భాగం చరిత్రలో కలిసిపోలేదనే చెప్పాలి." ఆమె చెప్పింది.

లైబ్రరీ అంటే ఇష్టమైన నేను ఆమె చెప్పేది శ్రద్ధగా విన్నాను కానీ తోటి పర్యాటకులు పట్టించుకోక వారిలో వారు మాట్లాడుకోసాగారు. ఒకటి, రెండుసార్లు ఆమె వారి వంక విసుగ్గా చూసింది కూడా.

"ప్రస్థుతానికి వస్తే ఈ నేషనల్ లైబ్రరీని 16 అక్టోబర్ 2002లో ఆరంభించాం. దీని పేరు బిబ్లియోథెనా అలెగ్జాండ్రినా. మెడిటరేనియన్ సముద్రపు ఒడ్డున దీన్ని పాత లైబ్రరీ గౌరవార్థం ఏర్పాటు చేసారు. లైబ్రరీ ఉన్న ఒరిజనల్ లొకేషన్ సముద్రంలో ఉందిప్పుడు. ఇది అలెగ్జాండ్రియా యూనివర్సిటీ ఆలోచన. అప్పటి ఈజిప్ట్ అధ్యక్షుడు హోస్నీ ముబారక్. యునెస్కో దీనికి మద్దతు ఇచ్చారు. 1988లో యునెస్కో ఈ లైబ్రరీ భవంతి ఆర్కిటెక్చరల్ డిజైన్ పోటీని నిర్వహించింది. నార్వేకి చెందిన స్నోహెట్టా అనే ఆర్కిటెక్చరల్ ఆఫీస్ గెలుపొందింది. మొత్తం 1400మంది దీంట్లో పాల్గొన్నారు. 1995లో ఆరంభించి అక్టోబర్ 2002లో నిర్మాణం పూర్తిచేసి తెరిచారు .దీని పైన 104 అడుగుల ఎత్తులో, 524 అడుగుల చుట్టుకొలతతో సన్‌డయల్‌లా సముద్రం వైపు వంపు తిరిగిన రూఫ్ ఉంది. దీని బయట గోడలని ఆశ్వాన్ నించి తెచ్చిన గ్రానైట్‌తో కట్టారు. 120 భాషల అక్షరాలని దీని మీద చెక్కారు.

"ఇక్కడ ఎన్ని భాషల పుస్తకాలు లభిస్తాయి? మూడు. అరబిక్, ఇంగ్లీష్, ఫ్రెంచ్. 2010లో నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఫ్రాన్స్ నించి ఐదు లక్షల ఫ్రెంచ్ పుస్తకాలు ఉచితంగా వచ్చాయి. ఆఫ్రికా - అరబ్ ప్రపంచాల్లో ఎక్కువ ఫ్రెంచ్ పుస్తకాలు ఉన్న లైబ్రరీ ఇదే ఇది ఎంత పెద్దది? 80 లక్షల పుస్తకాలు పెట్టేటంత షెల్ఫ్ స్పేస్ ఉంది. పదకొండు అంతస్థుల్లో ఏడున్నర లక్షల చదరపు అడుగుల రీడింగ్ రూమ్స్ ఉన్నాయి. మేప్స్‌కి, మల్టీమీడియాకి, అంధులకి, యువతకి, పిల్లలకి ప్రత్యేక లైబ్రరీలు, 4 మ్యూజియాలు, 4 ఆర్ట్ గేలరీలు (తాత్కాలిక ఎగ్జిబిషన్‌కి) 15 శాశ్వత ఆర్ట్ గేలరీలు, ప్లానెటోనియం, కాగితాలని రిస్టోర్ చేసే లేబ్ ఉన్నాయి."

మమ్మల్ని మెయిన్ రీడింగ్ రూమ్‌కి తీసుకువెళ్ళి చూపించి చెప్పింది.

"సూయజ్ కెనాల్ నిర్మాణానికి చెందిన డాక్యుమెంట్స్ అన్నీ ఈ లైబ్రరీలో ఉన్నాయి. మా లైబ్రరీకి ఇంటర్నెట్ ఆర్కైవ్ ఉంది. 1996 - 2001 మధ్య ఒక కోటి 60 లక్షల వెబ్‌సైట్స్‌కి చెందిన 1000 కోట్ల వెబ్ పేజెస్ మా దగ్గర అందుబాటులో ఉన్నాయి. ఈజిప్షియన్, అమెరికన్ టెలివిజన్ బ్రాడ్ కాస్ట్‌లు 2000 గంటలకి సరిపడేవి కూడా మా దగ్గర ఉన్నాయి. 200 కంప్యూటర్స్‌లో వంద టెర్రాబైట్స్ సమాచారాన్ని స్టోర్ చేసాం. మెయిన్ లైబ్రరీ, స్పెషలైజ్డ్ లైబ్రరీ, టాహా హుస్సేన్ లైబ్రరీ, టాహా ఈజిప్షియన్ ప్రొఫెసర్ ఆఫ్ అరబిక్, మూడో ఏటే గుడ్డివాడైన ఈయన గౌరవార్ధం ఆ పేరు పెట్టాం. 1901 నించి నేటి దాకా నోబుల్ ప్రైజ్ పొందిన వారు రాసిన పుస్తకాలు కూడా ఇక్కడ నోబుల్ సెక్షన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఏంటిక్విటీ మ్యూజియంలో అలెగ్జాండర్ ది గ్రేట్, రోమన్, ఈజిప్ట్ కాలాలకి చెందిన అనేక వస్తువులు చూడొచ్చు. రేర్ మేన్యు స్క్రిప్ట్ మ్యూజియంలో 6వేల అరుదైన పుస్తకాలు మేప్స్ ఉన్నాయి. మైక్రో ఫిల్మ్ లైబ్రరీలో 30వేల అరుదైన పుస్తకాలు, 50వేల డాక్యుమెంట్స్, 14వేల అరబిక్, పర్షియన్, టర్కిష్, మేన్యుస్క్రిప్ట్స్, జాతీయ అరబిక్ దినపత్రికలు ఉన్నాయి. ఇక్కడి సాదత్ మ్యూజియంలో ఒకప్పటి ఈజిప్షియన్ ప్రెసిడెంట్ అన్వర్ అల్ అసాదత్ వాడిన వస్తువులు ఉన్నాయి."

ఆ గదిలోకి తీసుకెళ్ళింది. ఆయన నోబుల్ ప్రైజ్ మెడల్, ఆయన చదివిన ఖురాన్ పుస్తకం, చేత్తో రాసిన ఉత్తరాలు, ఆయన, ఆయన కుటుంబ సభ్యుల ఫోటోలు, ఆయన చదివిన ఖురాన్‌లోని కొంత భాగం రికార్డింగ్, సాదత్ గురించి రాసిన వివిధ దినపత్రికల్లోని వ్యాసాలు, ఆయన్ని షూట్ చేసినప్పుడు ధరించిన రక్తసిక్తమైన మిలటరీ దుస్తులు చూసాం.

ఈజిప్షియన్ ఫిల్మ్ డైరెక్టర్, రచయిత, కాస్ట్యూమ్ డిజైనర్ షాదీ అబ్దుల్ సలాం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఆయన వ్యక్తిగత లైబ్రరీ, ఫర్నిచర్, అనేక అవార్డ్‌లు, ఆయన సినిమాల్లోని అనేక కాస్ట్యూమ్స్, ఆయన స్టోరీ బోర్డ్, పెయింటింగ్స్ కూడా ఓ విభాగంలో చూసాం. ఇతను 1930లో అలెగ్జాండ్రియాలో జనించి, ఇంగ్లండ్‌లో ఫైనార్ట్స్ చదివాడు. ఇతను 'ది నైట్ ఆఫ్ ది కౌంటింగ్ ఇయర్స్, అఫ్క్' లాంటి అనేక సినిమాలు తీసాడు.

కేబిన్స్‌లోని కుర్చీల్లో కూర్చుని చాలామంది చదువుతూ కనిపించారు. లోపల ఫోటోలు తీయకూడదు. డిజిటల్ పుస్తకం ప్రింటింగ్ మెషిన్‌ని అక్కడి గైడ్ మాకు చూపించింది. ఐదు నిమిషాల్లో తెల్లకాగితం పుస్తకంగా ప్రింటై, బైండై బయటికి వస్తుంది.

ఈజిప్షియన్ మాగ్‌జైన్స్ బొమ్మలు అక్కడక్కడ గోడల మీద కనిపించాయి. అక్కడి సావనీర్ షాపులో అనేక రకాల సావెనీర్స్ అమ్ముతున్నారు. అన్నీ ఖరీదుగా ఉన్నాయి.

రెండుం ముప్పావుకి లైబ్రరీనించి లంచ్‌కి బయలుదేరాం.

"ఈ లైబ్రరీ ఈజిప్ట్‌కి వైట్ ఎలిఫెంట్ అని ఓ విమర్శ ఉంది. ఈజిప్ట్‌లోని సెన్సార్ షిప్ దీన్ని సమర్ధవంతంగా పని చేయనివ్వదు." తారిఖ్ చెప్పాడు.

మెడిటెరేనియన్ సీ పక్కన రోడ్డుకి ఇవతల వైపున్న సిసిల్ హోటల్‌కి చేరుకున్నాం. మాకిచ్చిన వాటర్ బాటిల్ మీద 'నేచురల్ డ్రింకింగ్ వాటర్ ఫ్రం శివా ఒయాసిస్' అని రాసి ఉంది. మన కిన్లేలాంటి కంపెనీలు రుచికి కొద్దిగా కలుపుతారు. కిడ్నీ పేషెంట్లు ఈ నీటిని

తాగడం మంచిది కాదు. ఆ హోటల్‌లో మమ్మల్ని చూసి వండినట్లున్నారు. చాలా ఆలస్యంగా సర్వ్ చేసారు. అన్నం సగమే ఉడికింది.



క్వైట్ బే కోట

దాంతోపాటు పప్పు, బ్రెడ్, బన్స్ ఇచ్చారు. కానీ జామ్ కాని, బటర్ కాని లేదు. ఏపిల్, అరటిపండు, ఆరెంజ్ కలిపిన ఫ్రూట్ సలాడ్‌ని డిజర్ట్‌గా ఇచ్చారు. వెయిటర్స్ కూడా సర్వింగ్‌లో చాలా నిర్లక్ష్యంగా ఉన్నారు. స్థానిక ట్రావెల్ ఏజన్సీ సజెషన్ ఫాంలో ఇండియన్స్‌కి ఈ హోటల్‌ని రికమెండ్ చేయనని రాసాను.

మా ఎస్. ఓ.టి.సి టూర్ మేనేజర్ మహ్మద్ కూడా ఇబ్బందిగా తయారయ్యాడు. ఇంతదాకా ఎస్.ఓ.టి.సి టూర్ మేనేజర్స్ మా భోజనాలు అయ్యేదాకా ఆగి, అందరికీ, అన్నీ వచ్చాయా అని చూసేవారు. మాది అయ్యాకే తినేవారు. ఒకోసారి టైమ్ లేకపోతే గదికి పార్శిల్ తీసుకెళ్ళేవారు. మమ్మల్ని పట్టించుకోకుండా మహ్మద్ మాతో పాటే లోకల్ గైడ్‌తో కూర్చుని తినేసేవాడు.

మా ముందు సీట్లోని అగర్వాల్‌కి పప్పు ఇచ్చారు. కానీ అన్నం ఇవ్వలేదు. దాంతో ఖాళీగా కూర్చున్నాడు. భోజనం చేసే మహ్మద్ ఇది గమనించి లేచి వచ్చి ఆయన సంగతి చూసాడు. అగర్వాల్ కనపడని చోట కూర్చుని ఉంటే లంచ్ మిస్సయ్యేవాడు.

టూర్‌లో పర్యాటకుల ముందు స్థానిక గైడ్, చివర టూర్ మేనేజర్ వెళ్ళడం ఎస్.ఓ.టిసి సాంప్రదాయం. ఆ విధంగా పర్యాటకులు ఎవరూ మిస్ కాకుండా చూస్తారు. కానీ మహ్మద్ ఈ జాగ్రత్త తీసుకోకపోవడం కూడా గమనించాను.

లంచ్ తర్వాత సముద్రపు ఒడ్డున ఉన్న క్వైట్ బే సిటాడెల్‌కి వెళ్ళాం. సుల్తాన్ అల్ అష్రాఫ్ సైఫ్ అల్ డిల్ క్వైట్ బే క్రీ.శ 1477లో దీన్ని నిర్మించాడనే ఫలకం కోటలో కనిపించింది. ఇది ఈజిప్ట్‌లోనే కాక, మెడిటెరేనియన్ సముద్ర తీరంలోని అతి ముఖ్యమైన కోట. ఫారోస్ ఐలండ్‌కి తూర్పు దిశలో హార్బర్ దగ్గర ఇది ఉంది. అలెగ్జాండ్రియా లైట్ హౌస్ ఉన్న ప్రాంతంలోనే దీన్ని నిర్మించారు.



మా గైడ్ మహ్మద్

అలెగ్జాండ్రియా తీరానికి వచ్చే నౌకలకి మార్గదర్శకంగా ఏదైనా నిర్మించాలనే ఆలోచన అలెగ్జాండర్‌కి కలిగింది కానీ అది రూపుదిద్దుకోకుండానే ఆయన మరణించాడు. తర్వాతి ఈజిప్ట్ రాజైన ఫారోస్ అనే చిన్న దీవిలో క్రీస్తుపూర్వం 2వ శతాబ్దంలో లైట్ హౌస్ నిర్మించాడు. ఆ దీవి పేరే ఈ లైట్ హౌస్ పేరవడమే కాక, గ్రీక్, ఫ్రెంచ్, స్పేనిష్ భాషల్లో ఫారోస్ లైట్ హౌస్‌కి ప్రత్యామ్నాయ పదమైంది. దీన్ని ఫారోస్ ఆఫ్ అలెగ్జాండ్రియ అని కూడా పిలిచేవారు.

అది పూర్తయ్యేనాటికి టోలమీ - 2 అధికారంలో ఉన్నాడు. చాలా వందల ఏళ్ళు ఇది ప్రపంచంలో మనిషి నిర్మించిన అతి ఎత్తయిన కట్టడంగా ఉండేది. ఇది ఏడు ప్రాచీన ప్రపంచ వింతల్లో ఒకటి. అంతేకాదు. ప్రాచీన ఏడు వింతల్లో ఎక్కువకాలం నిలిచి ఉన్న వాటిలో దీనిది మూడో స్థానం. అప్పట్లో పిరమిడ్లు తప్ప నాలుగు భాగాలుగా 400 అడుగుల ఎత్తున్న ఈ లైట్ హౌస్ కన్నా ఎత్తైన కట్టడం మరోటి లేదు. మొదటి 20 అడుగులు వేదిక, దానిమీద 200 అడుగుల ఎత్తు, వంద అడుగుల వెడల్పు గల దీర్ఘచతురస్రపు నిర్మాణం ఉండేది. మూడో భాగం దానిమీద ఎనిమిది భుజాలు గల నిర్మాణం, దానిమీద స్థూపాకారాన్ని నిర్మించారు. స్థూపం మీది గదిలో కంచుతో చేసిన అద్దంలాంటి ఫలకం ముందు కట్టెలతో మంటని వెలిగించేవారు. అది సముద్రంలో చాలా కిలోమీటర్ల దూరంలోని ఓడలకి కనిపించేది. శత్రునౌకల వైపు

వేడి కిరణాలని ఆ అద్దంలోంచి ప్రసరించడం ద్వారా వాటిని ధ్వంసం చేసేవారని, పొరుగు రాజ్యాల్లో ఏం జరుగుతోందో ఈ అద్దంలో కనిపిస్తుందని కట్టుకథలు ప్రచారంలో ఉండేవి. ఇలా ఫారోస్ ద్వీపంలోని ఫారోస్ పేర పిలవబడే అది ప్రపంచంలోని మొదటి లైట్ హౌస్‌గా నిలిచిపోయింది.

దీని నిర్మాణాన్ని పర్యవేక్షించిన సోస్ట్రాటస్ లైట్ హౌస్ మీద తన పేరుని రాసుకోడానికి రాజుని అనుమతి కోరితే నిరాకరించి, తన పేరుని రాయమని టోలమీ - 2 ఆజ్ఞాపించాడు. తెలివైన సోస్ట్రాటస్ తన పేరుని లైట్ హౌస్ మీద చెక్కించి, దాని మీద సున్నం అద్దించి, ఆ సున్నం మీద రాజు పేరుని రాయించాడు. కొన్నేళ్ళకి పై సున్నం పూత రాలిపోయి సోస్ట్రాటస్ పేరు మాత్రం నిలిచిపోయింది.

క్రీ.శ 956-1323ల మధ్య వచ్చిన మూడు భూకంపాల వల్ల ఇది నాశనమైంది. 1303లో వచ్చిన తీవ్రమైన తుఫానువల్ల బలహీనపడ్డ దీని పై భాగం కూలిపోయింది. 14వ శతాబ్దంలో ఈజిప్ట్ సుల్తాన్ లైట్ హౌస్ పునాదికి ఉపయోగించిన రాళ్ళతో క్వైట్ బే కోటని నిర్మించాడు. ఫారోస్ దీవి చుట్టూ సముద్రంలో ఈ కట్టడానికి ఉపయోగించిన భారీ సున్నపురాళ్ళు కనిపించాయి. ఈజిప్ట్ ప్రభుత్వం యునెస్కోతో కలిసి సముద్రగర్భంలో కలిసిన ప్రాచీన అలెగ్జాండ్రియా శిథిలాలతో అండర్ వాటర్ మ్యూజియాన్ని నిర్మించే ఆలోచనలో ఉంది.

ఆ కోటలో ఓ మసీదు కూడా ఉంది. 55 అడుగుల ఎత్తుగల చతురస్రపు భవంతి ఈ మసీదు. రెండో అంతస్థులోని మసీదు చుట్టూ నాలుగు పాసేజెస్, నాలుగు పెద్ద హాల్స్ ఉన్నాయి. సైనికులు, పాలకులు ఆ హాల్స్‌లో కలుసుకునేవారు. సముద్రం వైపున్న ఆ కారిడార్‌లోని గదుల్లో ఫిరంగుల, తుపాకుల కోసం గోడల్లో రంధ్రాలున్నాయి. ఈ కోట సహజసిద్ధమైన కొండమీద నిర్మించబడింది. కోట ఆవరణలో యు ఆకారంలోని భవంతుల్లోని గదుల్లో సైనికులు నివశించేవారు. ఈజిప్ట్ జెండా ఎగిరే ఈ కోట నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. మహ్మద్ ఆలీ కాలంలో సైనికుల బేరక్స్‌గా ఆవరణలో మూడు వైపులా 35 గదులు బేరక్స్ నిర్మించారు. ఇది సెకండ్ అలిన్ ఆఫ్ డిఫెన్స్‌గా ఉండేది.

మా అలెగ్జాండ్రియా పర్యటన ముగియడంతో 5.30కి క్వైట్ బే కోటనించి బయలుదేరి రాత్రి 8.30కి కైరోలోని నవాబ్ హోటల్‌కి డిన్నర్‌కి చేరుకున్నాం. వీరికి బేగమ్ అనే మరో రెస్టరెంట్ కూడా కైరోలో ఉంది. ఆలూ టిక్కి, అన్నం(పొట్టి బియ్యం) మసాలా పన్నీర్ కర్రీ, సాంబార్, రసం, పాపడ్, గులాబ్‌జామ్(లోపలంతా పచ్చిగా ఉంది) పెరుగు. మంచినీళ్ళు ఉచితం. అంతా ఇచ్చే రెండో కూర ఇవ్వలేదు. సమీపంలోని ఓ మెడికల్ షాపుకి వెళ్ళి 7.50 పౌండ్స్‌కి టూత్ పేస్ట్ కొన్నాను. దాని ఎదురుగా జోర్డాన్ ఎంబసీ కనిపించింది.

అక్కడినించి రాత్రి పదికల్లా మూవెన్ పిక్ హోటల్‌కి చేరుకున్నాం. దారిలో ఓ చోట తారిఖ్ దిగిపోయాడు.

"రేపు ఉదయం వేకప్ కాల్ సిక్స్‌కి. సెవెన్‌కి బ్రేక్‌ఫాస్ట్, ఎయిట్‌కి లాబీలో సిద్ధంగా ఉండాలి" బస్ దిగబోయే ముందు మహ్మద్ చెప్పాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి